క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాడ్గుల: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ వరమని మాజీ ఉపసర్పంచ్ మిద్దె రాములు అన్నారు. మండల పరిధి పెద్ద మాడ్గుల గ్రామానికి చెందిన బోయిని పూజ కుటుంబానికి రూ.52 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరు కాగా.. శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ప్రైవేట్ ఆస్పత్రులో ఖరీదైన వైద్యం చేయించుకోని పేదలు.. ఈ సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దేవయ్య, శివ, నరేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల అరెస్టు



పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నేతలు

ఇబ్రహీంపట్నం: విద్యాశాఖకు బడ్జెట్ కేటాయింపులో ప్రభుత్వం వివక్ష చూపించిందని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపించారు. పార్టీ ఇచ్చిన అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో.. శనివారం ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బీఆర్‌ఎస్ విద్యార్థి, యువజన విభాగాల నాయకులు జెర్కొని రాజు, నిట్టు జగదీశ్వర్, మడుపు శివసాయి, పి.రాజ్‌కుమార్, యుగంధర్ ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



మురుగు కాల్వ పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామ పరిధి ఇస్రాయిపల్లిలో రూ.5 లక్షలతో భూగర్భ మురుగుకాల్వ నిర్మాణ పనులను శనివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన నిధులతో పనులు చేపట్టామని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అజీజ్, నాయకులు ఆరిఫ్, రాజు, విష్ణు, రమేశ్, ఆఫ్తాబ్, శ్రీశైలం, వెంకటేశ్, జంగయ్య, కిరణ్, బాలకృష్ణ, సాయి కిరణ్, బాలస్వామి, నరేశ్, శ్రీకాంత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ తోటల పరిశీలన



పట్టుపురుగుల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం కోరింతకుంటతండాలోని మల్బరీ తోటలను భద్రాచలం, నాగర్‌కర్నూల్, కొడంగల్, షాద్‌నగర్ ప్రాంతాలకు చెందిన సుమారు 80 మంది రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి స్థానిక రైతులు.. మల్బరీ తోటలు, పట్టుపురుగుల పెంపకం గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త వినోద్‌కుమార్, ఖమ్మం జిల్లా పట్టుపరిశ్రమ ఉపసంచాలకులు రాఘవేంద్ర, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ముత్యాలు, మల్బరీ తోటల రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు సక్రు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ముస్లింలు

మంచాల: వీఆర్‌వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ మధు, ఎస్‌ఐ సతీష్, ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన మాంసం..

కాలం చెల్లిన ఆహార పదార్థాలు

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- హోటల్ నిర్వాహకుల ఇష్టారాజ్యం
- ప్రజారోగ్యంతో చెలగాటం

తుర్కయంజాల్: కల్తీ ఆహారం కట్టలు తెచ్చుకుంటోంది. ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ కొరవడంతో హోటళ్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కుళ్లిన మాంసం, నాసిరకం సరకులతో నోరూరించే బిర్యానీ తదితర తినుబండారాలు విక్రయిస్తూ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఇవేమి తెలియని భోజన ప్రియులు ఇష్టంగా తింటూ.. ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. తాజాగా ఈ నెల 21న తుర్కయంజాల్‌లోని 'తులిప్స్ గ్రాండ్ హోటల్'పై టాస్క్‌ఫోర్స్ దాడులు చేయగా.. విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి.



అధికారులు తనిఖీ నిర్వహించిన హోటల్

ప్రజల భయాందోళన

ఈ సోదాల్లో ఫ్రిజ్‌లో కుళ్లిపోయిన 96 కేజీల మాంసం, గడువు తీరిన పుట్టగొడుగులు 10 ప్యాకెట్లు, పాడైన ఐస్‌క్రీమ్‌ను గుర్తించినట్లు అధికారులు ప్రకటించారు. వంటగది పూర్తిగా అపరిశుభ్రంగా ఉందని, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని గుర్తించారు. ఉపయోగించిన నూనెను మళ్లీ వాడుతున్నారని తేల్చారు. ఇదిలా ఉండగా.. ఈ ప్రాంతంలో ఈ హోటల్ నిత్యం భోజన ప్రియులతో రద్దీగా ఉంటుంది. సకుటుంబ సమేతంగా అనేకులు ఇక్కడ భోజనం చేస్తుంటారు. ఇళ్లకు పార్శిళ్లు తీసుకెళ్తుంటారు. అలాంటి హోటల్లో కుళ్లిన మాంసం బయటపడటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇన్ని రోజులు తాము తింటున్నది ఈ ఆహారమా అని విస్తుపోతున్నారు.

రాఘవేంద్ర హోటల్లోనూ..

మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలోని రాఘవేంద్ర హోటల్‌పై ఏడాదిన్నర క్రితం మున్సిపల్ అధికారులు తనిఖీలు చేయగా.. కుళ్లిన ఆహార పదార్థాలు బయటపడ్డాయి. ఆ సమయంలో హోటల్ నిర్వాహకులకు ఫైన్ విధించి అధికారులు చేతులు దులుపుకొన్నారు. ఆ తరువాత మున్సిపల్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు పెద్దగా దృష్టి సారించకపోవడంతో.. హోటళ్ల యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ఆదాయమే లక్ష్యంగా ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. హోటళ్లు, బార్లు, బేకరీలు, టిఫిన్ సెంటర్లపై అధికారుల నిఘా కొరవడిందని, ఇకనైనా నిత్యం సోదాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. శుభ్రత, నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తున్నారు.



పట్టుబడిన కుళ్లిన మాంసం

రక్తదానం.. ప్రాణదానం



ఆమనగల్లు: యోధుల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

- స్వాతంత్య్ర సమరయోధులను ఆదర్శంగా తీసుకోవాలి
- డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్

ఆమనగల్లు/ ఇబ్రహీంపట్నం: రక్తదానం చేస్తే మరి కొందరికి ప్రాణదానం చేసినట్లేనని, సామాజిక సేవ కార్యక్రమాల్లో యువత ముందుండాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా శనివారం ఇబ్రహీంపట్నం పాషనరహరి స్మారక కేంద్రంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. బ్రిటీష్ వలస సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశానికి సంపూర్ణ స్వాతంత్య్రం కోసం పోరాడి, అతి చిన్నవయసులోనే ఉరికంబాన్ని ముద్దాడిన యువకిశోరాలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లని పేర్కొన్నారు. వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి యువతను పట్టిపీడిస్తుందని, వాటిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బెట్టింగ్ యాప్‌లను ప్రభుత్వం బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.జగన్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి.శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య, చరణ్, రాఘవేందర్, బోడ వంశి, శ్రీకాంత్, విప్లవ కుమార్, వినయ్, గణేశ్, భగత్, యాదగిరిలు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: రక్తదానం చేస్తున్న యువకులు

ఆమనగల్లులో..

భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మాస్టర్ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆ ముగ్గురు యోధులు దేశ స్వాతంత్య్రం కోసం పోరాడి అమరులయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, నాయకులు సుదర్శన్, వినోద్, జయరాం, సునీత, ప్రవళిక, ప్రిన్సిపాల్ చందు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించండి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. 2019– 24 ఐదు సంవత్సరాల కాలంలో నాటి సర్పంచులు.. సొంత డబ్బు వెచ్చించడమే కాకుండా.. అప్పు చేసి గ్రామాలను అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. కానీ నేటి వరకు ఆ పనుల బిల్లులు రాలేదన్నారు. దీంతో వారు అప్పు తీర్చలేక, వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బాధతో కొందరు ఆత్మహత్య చేసుకున్నారని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బిల్లులు చెల్లించలేని సర్కార్.. అందాల పోటీలను ఎలా నిర్వహి స్తుందని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే.. పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు విస్మరించిందని విమర్శించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేని పక్షంలో తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని లక్ష్మీనర్సింహారెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా, మాజీ సర్పంచ్‌లు హరిచంద్, సుగుణ సాయిలు, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు వీరయ్య, లాయక్‌అలీ, రామకృష్ణ, నర్సింహ, రవి, మహేశ్, అంజి, నాగార్జున, కుమార్, సురేశ్, జంగయ్య, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం

కడ్తాల్: ఉపాధ్యాయ రంగానికి ఎపీయూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి చేసిన సేవలు చిరస్మరణీయమని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య అన్నారు. వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 18 సంవత్సరాల సర్వీస్‌ను త్యాగం చేసి, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షులు మల్లయ్య, కౌసల్య, విష్ణుమూర్తి, చందులాల్, బీముడు, జనార్దన్‌రెడ్డి, రవి, భాగ్యలక్ష్మి, బుచ్చమ్మ తదితరులు ఉన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వినయ్ సాగర్

మాడ్గుల: మండల కేద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ వినయ్ సాగర్ పరిశీలించారు. సౌకర్యాల గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కాల్వలను కాపాడండి

ఇబ్రహీంపట్నం రూరల్: కబ్జాలకు గురైన కాల్వలను కాపాడాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. శనివారం ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామంలో పలు కాల్వలను పరిశీలించారు. బురుకుంట కాల్వ, కథాన్‌చెరువు కాల్వలను కాపాడాలని కోరారు. నాగులమ్మ చెరువు నుంచి బురుకుంట వరకు ఉన్న కాల్వ మరమ్మతుకు రూ.20 లక్షలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రాజు, యాదయ్య, లక్ష్మయ్య, రాములు, రవి, బాల్‌రాజ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

కొత్తూరు: సిద్ధాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంగూర్ నాయక్, హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మీ, రఘుపాల్, నాయకులు శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదానం చేస్తున్న యువకులు

ఆమనగల్లు: పట్టణంలోని గాంధీచౌక్ వద్ద శనివారం జూలూరు రాఘవేందర్ స్మారకార్థం.. 'ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ' సహకారంతో శనివారం ఆయన మిత్రులు నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా శిబిరం వద్ద రాఘవేందర్ చిత్రపటానికి తల్లిదండ్రులు రాధ, నర్సింహ, కుటుంబ సభ్యులు రోజ, అనంత్, హరిక, విక్రాంత్, ఆర్యవైశ్యసంఘం నాయకులు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శిబిరంలో 75 మంది యువతీ, యువకులు రక్తదానం చేశారు. దాతలకు సొసైటీ తరఫున సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాపిశెట్టి రాము, కండె పాండురంగయ్య, వీరబొమ్మ రామ్మోహన్, రమేశ్, శ్యాంసుందర్, ఉదయ్, కండె సాయి, మిత్రులు అప్పి, వస్పుల శ్రీకాంత్, రాజేశ్, వివేక్, సాయిప్రసాద్, సాయిరాం, మహేశ్, రామకృష్ణ, నితిన్, రాజు, సాయిచరణ్ తదితరులు ఉన్నారు.

ఫైలెట్ గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరణ

వ్యవసాయ యంత్రాల కోసం 212 అప్లికేషన్లు

యాచారం: రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఫైలెట్ పథకం కింద ఎంపిక చేసిన మొండిగౌరెల్లి, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరల ఉత్పత్తి పెంచడం కోసం ఏఏ పనిముట్లు, యంత్రాలు కావాలో రైతుల నుంచి శనివారం అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఆయా గ్రామాల్లోని జీపీ కార్యాలయాల్లో జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ జిల్లా అధికారి సురేష్, ఆ శాఖ ఉన్నతాధికారులు హరిత, హిమబిందు, నవీన, వ్యవసాయ కమిషన్ నుంచి ఏఓ హరివెంకటప్రసాద్, ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాత, యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్ తదితరులు దరఖాస్తులు అందుకున్నారు. మూడు గ్రామాల్లో డ్రిప్, స్ప్రింక్లర్లు, పీవీసీ పైపులు, సోలార్ పెన్సింగ్, వ్యవసాయ యంత్రాలు, బ్యాటరీ, పవర్ పంపులు, కూరగాయల విత్తనాలు, నార్లు తదితర సంక్షేమ పథకాలకు 212 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులు చేసుకున్న వారికి వ్యవసాయ కమిషన్ రాయితీపై పరికరాలు అందిస్తామని అధికారులు పేర్కొన్నారు.



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

భూములు పోయాక ఏం చేయాలి?

పుదీన, ఆకుకూరల సాగును మరింత ఉత్పత్తి పెంచాలని మొండిగౌరెల్లి గ్రామాన్ని వ్యవసాయ కమిషన్ ఫైలెట్ పథకం కింద ఎంపిక చేసిందని రైతులు తెలిపారు. కానీ ఇప్పుడు అదే గ్రామంలోని వ్యవసాయ భూములను ఇవ్వాలని ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని అధికారుల ఎదుట రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. భూములు పోయాక ఏం చేయాలని వాపోయారు.

నేటి నుంచి వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు

ఇబ్రహీంపట్నం రూరల్: శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి 22వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని దేవాలయ కమిటీ చైర్మన్ బూడిద రాజిరెడ్డి, వైస్ చైర్మన్ దొడ్డి సత్తయ్యలు కోరారు. పండిత శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల సీతారామాచార్యుల ఆధ్వర్యంలో జరగనున్నాయని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవాచనము, నవకలశ స్నపన తిరుమంజనము, విశేష అలంకరణ తిర్థప్రసాద గోష్టి, సాయంత్రం 5 గంటలకు సామూహిక శ్రీ విష్ణు సహస్ర నామస్తోత్ర పారాయణం, స్వస్తి వాచనము విశ్వక్సేన ఆరాధన ముత్సంగ్రహణ, అంకురార్పణ తీర్థ ప్రసాద గోష్టి. 24న సుప్రభాత సేవా ఆరాధన బాలభోగం, మండప ఆరాధన ద్వారతోరణ పూజ అగ్నిప్రతిష్ఠ, గరుడ ముద్ద బలిహరణ తీర్థప్రసాద గోష్టి. 25న దేవతాహ్వానం, హోమం, బలిహారం, ఎదుర్కోళ్లు, కల్యాణ మహోత్సవం. 26న రథోత్సవ బాలభోగం, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, విశేష అలంకరణ, ద్వాదశి ఆరాధన, శ్రీపుష్ప యాగం, సప్తవర్ణాలు పవలింపు సేవా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

డ్రైనేజీ పనులకు మోక్షం

పనులు పరిశీలించిన ఎంపీడీఓ వెంకటమ్మ

ఇబ్రహీంపట్నం: ఎట్టకేలకు ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ పైపులైన్, మరుగుదొడ్లు, నీటి సమస్యల పరిష్కారానికి మోక్షం లభించింది. సుమారు రెండేళ్లుగా తీవ్ర అసౌకర్యంతో సతమతమవుతున్న అధికారులు.. సమస్యలను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన.. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.5 లక్షల నిధులను మంజూరు చేయించారు. దీంతో సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. ఆయా నిర్మాణం, మరమ్మతు పనులు వేంగంగా కొనసాగుతున్నాయి. శనివారం డ్రైనేజీ పైపులైన్, వాటర్ సంపు పనులను ఎంపీడీఓ వెంకటమ్మ పరిశీలించారు. నాణ్యతతో కూడిన పనులు చేయాలని, ఎక్కడా రాజీపడొద్దని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆమెతో మండల ఏఈ ఉస్మాన్, సూపరింటెండెంట్ ఎల్లంకి జంగయ్యగౌడ్‌లు ఉన్నారు.



సంపు పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ తదితరులు

బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సాయిలాల్



కడ్తాల్: బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండల పరిధి గోవిందాయిపల్లితండాకు చెందిన బాణావత్ సాయిలాల్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయిలాల్ మాట్లాడారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి అధిష్టానం ఈ బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. అనంతరం తన నియామకానికి సహకరించిన, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు ఆచారికి కృతజ్ఞతలు తెలిపారు. సాయిలాల్ నియామకం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తంచేశారు.

నిర్మాణ సామగ్రి అందజేత

కడ్తాల్: భవన నిర్మాణ కార్మికుల 'మేస్త్రీ సంఘం' భవనానికి మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి చేయూత నందించారు. శనివారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి రూ.60 వేల నిర్మాణ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. గతంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో కుల సంఘాల భవన నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున కేటాయించి, పలు భవనాలను రూ.25 లక్షలతో పూర్తి చేయించానని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు నర్సింహ, వీరయ్య, సాయిలు, హరిచంద్, లాయక్‌అలీ, అశోక్, అంజీ, సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సామగ్రి అందజేస్తున్న మాజీ సర్పంచ్

కమనీయం.. వేంకటేశ్వరుడి కల్యాణం

ఉత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

యాచారం: వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. యాచారంలో 250 అడుగుల ఎత్తులో ఉన్న శ్రీ తిరుమలనాథ దేవాలయంలోని వేంకటేశ్వరస్వామి మూల విరాట్‌కు ఉదయం 9 గంటలకు పూజారి రాజేష్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన పూజారి హరిబాబు ఆధ్వర్యంలో 11 గంటలకు పద్మావతి, అలివేలుమంగ, వేంకటేశ్వరస్వామి కల్యాణ తంతు ప్రారంభమైంది. పచ్చటి పెళ్లి పందిరిలో దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. పూజారులు రెండు వర్గాలుగా ఏర్పడి వేంకటేశ్వరస్వామి ఓ వర్గం ఒక పక్క, పద్మావతి అలివేలు మంగమ్మ వర్గం మరో పక్క ఉండి పెళ్లి క్రతువును ముగించారు. కల్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణంతో మారుమోగాయి.

ప్రత్యేక పూజలో రైతు కమిషన్ చైర్మన్

కల్యాణోత్సవంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి, సావిత్రమ్మ దంపతులు పాల్గొన్నారు. దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కుమారుడు, కాంగ్రెస్ నేత మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన గౌరిశంకర్.. భక్తులకు పంపిణీ చేయడానికి యాదగిరిగుట్ట నుంచి వెయ్యి స్వామివారి లడ్డూలను తెప్పించారు. ఈ సందర్భంగా ప్రముఖులను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనువాస్‌రెడ్డి, భాస్కర్‌గుప్తా, సుదర్శన్‌రెడ్డి, అమృతాసాగర్, ముత్యాల వెంకట్‌రెడ్డి, అంగోత్ వెంకటేశ్, రెడ్డి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు (ఇన్‌సెట్లో) పూజలందుకుంటున్న స్వామివారు